సాక్షి నిజామాబాద్

శుక్రవారం ∙ 21 ∙ ఏప్రిల్ ∙ 2023



నిధులు లేక విలవిల

జీపీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కొన్ని నెలలుగా నిధులు రాకపోవడంతో సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



యథేచ్ఛగా మొరం తవ్వకాలు

ఎడపల్లి మండలం జంలం గ్రామ శివారులో కొందరు అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 41.9 /26.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురవచ్చు.



న్యూస్‌రీల్

ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి



ఇందల్వాయి : జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు పంచాయతీ పాలకవర్గాలు కృషి చేయాలని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లో డీపీవో జయసుధతో కలిసి గురువారం ఆమె పర్యటించారు. గ్రామ పంచాయతీలు సొంత నిధులతో అన్ని వర్గాల వారికి అవసరమైన పుస్తకాలు సేకరించి గ్రంథాలయం ఏర్పాటు చేస్తే, అనంతరం ప్రభుత్వం నుంచి నిధులు అందేలా చూస్తామని చెప్పారు. సిర్నాపల్లి జానకీబాయి గడీని గ్రంథాలయంగా మార్చిన సర్పంచ్ తేలు విజయ్‌ను అభినందించారు. సర్పంచులు విజయలక్ష్మారెడ్డి, నరేష్, కార్యదర్శులు ఉన్నారు.

చికిత్స అందించడం లేదని ఫిర్యాదు



సుభాష్‌నగర్: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో చికిత్స కోసం వెళ్లిన రోగులను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు తెడ్డు పోశెట్టి ఆరోపించారు. ఈ మేరకు గురువారం నవీపేట్ గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీకి ఫిర్యాదు చేశారు. తెడ్డు పోశెట్టి మాట్లాడుతూ నవీపేట్‌కు చెందిన సాయికుమార్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే జీజీహెచ్‌కు తీసుకొచ్చామని చెప్పారు. అక్కడ ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రజాప్రతినిధితో ఫోన్ చేయించినా.. రెండు గంటల పాటు వైద్యం కోసం నిరీక్షించామని, అయినా ఫలితం లేదని తెలిపారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా మారడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామస్తులు సూరిబాబు, రాకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అయూత చండీయాగానికి రూ.10 లక్షల విరాళం



సుభాష్‌నగర్ : నగరంలో కొనసాగిన విశ్వశాంతి మహాయాగానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం రూ.10లక్షలు విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజల కోసం నిర్వహిస్తున్న అయూత చండీయాగానికి ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10లక్షలు అందించడం తన పూర్వ జన్మసుకృతమని పేర్కొన్నారు. అనంతరం కృష్ణజ్యోతి స్వరూపానందస్వామీజీ మాట్లాడుతూ యాగం నిర్వహణకు ఆర్థికసాయాన్ని అడగ్గానే ధన్‌పాల్ సూర్యనారాయణ రూ.10లక్షలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్వామీజీ ధన్‌పాల్ సూర్యనారాయణను సన్మానించారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, కార్పొరేటర్లు బూరుగుల ఇందిరా, మాస్టర్ శంకర్, ఎర్రం సుధీర్, మెట్టు విజయ్, నాయకులు కిశోర్, ప్రభాకర్, హరీశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో ఇద్దరికి కరోనా

నిజామాబాద్ సిటీ : జిల్లాలో గురువారం నిర్వహించిన కరోనా పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 52 మందికి కరోనా పరీక్షలు చేయగా ఇద్దరికి కరోనా పాజిటివ్‌గా తేలిందన్నారు.

ప్రక్షాళన షురూ..

- కొరడా పట్టుకున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి
- ఏపీఆర్‌వో తొలగింపు, డెయిలీవేజ్ సిబ్బంది విధులకు రావొద్దని ఆదేశాలు



తెయూ రిజిస్ట్రార్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన యాదగిరి పాలక మండలి నిర్ణయాల అమలుకు శ్రీకారం చుట్టారు. మొదటి రోజు క్యాంపస్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. ఏపీఆర్‌వో తొలగింపుతో పాటు ఈసీ అనుమతి లేకుండా వీసీ నియమించిన 129 మందిని విధులకు రావొద్దని ఆదేశించారు. పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పదోన్నతులు, రెగ్యులర్ అధ్యాపకుల క్యాస్ పదోన్నతులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ చెల్లింపులు, నిధుల దుర్వినియోగంపై కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేస్తామన్నారు.

తెయూ (డిచ్‌పల్లి) : అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిన తెలంగాణ యూనివర్సిటీ ప్రక్షాళనకు పాలకమండలి (ఈసీ) ఆమోదంతో రిజిస్ట్రార్‌గా వచ్చిన ప్రొఫెసర్ ఎం యాదగిరి చర్యలు ప్రారంభించారు. బుధవారం హైదరాబాద్‌లోని రూసా భవనంలో జరిగిన ఈసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుకు ఆయన కొరడా చేతబట్టారు. గురువారం తెయూ రిజిస్ట్రార్‌గా తిరిగి ఆయన బాధ్యతలు స్వీకరించారు. వెంటనే క్యాంపస్‌లోని పలు విభాగాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ముందుగా ఏపీఆర్‌వోగా పని చేస్తున్న శ్రీనివాస్‌ను విధుల నుంచి తొలగించారు. వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ ఈసీ అనుమతి లేకుండా శ్రీనివాస్‌ను మ్యాథ్స్ విభాగం నుంచి అప్లయిడ్ ఎకనామిక్స్ విభాగానికి మార్చి పదోన్నతి ఇవ్వడంతో పాటు ఎరియర్స్ పేరిట రూ.9 లక్షలు చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి డబ్బులు రికవరీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం తన ఛాంబర్‌లో రిజిస్ట్రార్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాలకమండలి ఆదేశాల మేరకే తాను రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈసీలో చర్చించి తీర్మానించిన అంశాలను అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఈసీ అనుమతి లేకుండా వీసీ డెయిలీవేజ్ లేబర్ పేరిట నియమించిన 129 మంది సిబ్బందిని ఈ రోజు నుంచి విధులకు రావద్దని ఆదేశించినట్లు తెలిపారు. 2021 నవంబర్ 27 తర్వాత యూనివర్సిటీలో జరిగిన అడ్డగోలు కొనుగోళ్లు, చెల్లింపులు, నియామకాలు, పదోన్నతులు, నిధుల దుర్వినియోగంపై ఈసీ ఆదేశాల మేరకు నియమించిన ఐదుగురు సభ్యుల కమిటీ విచారణ జరుపుతుందన్నారు.



బాధ్యతలు స్వీకరించిన తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పదోన్నతులు, రెగ్యులర్ అధ్యాపకుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (క్యాస్) పదోన్నతులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఈసీ సమావేశంలో అనుమతి తీసుకుని క్యాస్ పదోన్నతుల నోటిఫికేషన్ వేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. గతంలో అనుమతించిన ప్రకారం టీచింగ్, నాన్–టీచింగ్ సిబ్బంది వేతనాలు మినహా ఇతర అక్రమ చెల్లింపులు, నిధుల దుర్వినియోగంపై కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

మూణ్నాళ్ల ముచ్చటేనా..

తెలంగాణ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఈసీ అనుమతి లేకుండా వీసీ ప్రొఫెసర్ రవీందర్ డెయిలీ వైజ్ లేబర్ పేరిట 129 సిబ్బందిని నియమించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి తెలిపారు. డెయిలీవైజ్ సిబ్బందిని గురువారం నుంచే విధులకు రావద్దని రిజిస్ట్రార్ ఆదేశించడంతో చేసేది లేక వారంతా ఇంటిదారి పట్టారు. ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.లక్షా 50 వేల వరకు ముడుపులు తీసుకుని నియమించినట్లు వీసీ పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. మూడు నెలలుగా దినసరి వేతనంతో పని చేస్తున్న సిబ్బందిలో కొందరికి ఇటీవలే రెండు నెలలు, మరికొందరికి నెల రోజుల వేతనం చెల్లించారు. కనీసం ఈ వీసీ పదవిలో ఉన్నంత కాలమైనా యూనివర్సిటీలో పని దొరుకుతుందని ఆశతో అప్పు చేసి మరీ ముడుపులు చెల్లించిన వారి ఆశలు ఆడియాసలయ్యాయి. కనీసం తాము ఇచ్చిన డబ్బులను ఎలా రికవరీ చేసుకోవాలనే విషయమై పలువురు సిబ్బంది ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

హస్తంలో అసంతృప్తులు..

- టీపీసీసీ పదవులు ఆశించి భంగపడిన సీనియర్లు
- ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్‌లలో ఊసే లేని హాథ్ సే హాథ్ జోడో యాత్ర



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి పీసీసీలో పదవులు ఆశించి భంగపడిన సీనియర్ నాయకుల్లో అసంతృప్తి పెరుగుతోంది. గత నెలలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో వచ్చిన ఊపును పార్టీ నాయకులు కొనసాగించలేకపోతున్నారు. జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఊసే లేకుండా పోయింది. ఈ రెండు నియోజకవర్గాల్లో గతంలో కేవలం రెండు చోట్ల మాత్రమే ఈ కార్యక్రమం నిర్వహించి వదిలేశారు. రాష్ట్రంలో జనవరి 26న ప్రారంభమైన ఈ కార్యక్రమం విషయంలో ఈ రెండు నియోజకవర్గాల్లో ఉదాసీనత ఎందుకని కార్యకర్తలు అంటున్నారు. ఇదిలా ఉండగా పలువురు సీనియర్ నాయకులు తమకు పీసీసీ పదవులు రాకపోవడంపై గుస్సాగా ఉన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన సీనియర్ నాయకుడు బాడ్సి శేఖర్‌గౌడ్ డీసీసీ అధ్యక్ష పదవి రేసులోకి వచ్చినప్పటికీ అది దక్కలేదు. దీంతో పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవిని ఆశించారు. అయినప్పటికీ ఇవ్వకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. గత 12 ఏళ్లుగా నిజామాబాద్ నగర అధ్యక్షుడిగా ఉన్న కేశ వేణు సైతం పీసీసీ ప్రధాన కార్యదర్శి పదవిని ఆశించారు. అయితే వేణు ప్రస్తుతం నగర అధ్యక్ష పదవిలోనే కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇక బాల్కొండ నియోజకవర్గానికి చెందిన బాస వేణుగోపాల్ యాదవ్ పీసీసీ అధికార ప్రతినిధి పదవిని ఆశిస్తున్నారు. టీడీపీ నుంచి రేవంత్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లోకి వచ్చిన వచ్చిన వేణుగోపాల్ యాదవ్ పీసీసీ సంయుక్త కార్యదర్శిగా గతంలో పనిచేశారు. ప్రస్తుతం ఆశించిన పీసీసీ పదవి దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. గతంలో పీసీసీ సభ్యుడిగా ఉన్న ముప్కాల్ మండలానికి చెందిన క్యాతం గంగారెడ్డి పీసీసీ కార్యదర్శి పదవిని ఆశిస్తున్నారు. నిజామాబాద్ నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ సయ్యద్ ఖైసర్ సైతం జిల్లా కాంగ్రెస్‌లో పదవిని ఆశిస్తున్నారు. గతంలో ఎంఐఎంలో కీలకంగా పనిచేసిన ఖైసర్‌కు మైనారిటీ ఏరియాల్లో గట్టి పట్టు ఉంది. ఇప్పటికే ఎన్నికల వాతావరణం వచ్చిన నేపథ్యంలో అసంతృప్తులకు పదవులు ఇచ్చే విషయంలో తాత్సారం చేస్తుండడం పట్ల కార్యకర్తలు గుస్సాగా ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో వచ్చిన జోష్‌ను కొనసాగించాలని, ఇందులో భాగంగా పదవులు ఆశిస్తున్న నాయకులకు వాటిని ఇచ్చి క్షేత్రస్థాయిలో మరింతగా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ఈ విషయంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ తగిన విధంగా పదవుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఉమ్మడి జిల్లాలో గురువారం రాత్రి పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కాగా రైతులు వరిపంటను కోసి రోడ్లపై, కల్లాల్లో ఆరబెట్టారు. టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ ధాన్యం తడిసే అవకాశముంది. అదే విధంగా నువ్వు, సజ్జ పంట కోత దశకు వచ్చే సమయంలో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మాచారెడ్డిలో పిడుగు పడి కాలిపోతున్న తాటిచెట్టు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాత్రి 8:40 గంటల నుంచి 10:40గంటల వరకు నగరంలో కరెంట్ పోయింది. అనంతరం నగరంలో సరఫరా పునరుద్ధరించినా.. పలు గ్రామాల్లో మాత్రం అంధకారం నెలకొంది.

అగ్నిమాపక శాఖ సేవలు అమోఘం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

ఖలీల్‌వాడి : యూనిఫామ్ సర్వీస్‌లోని అన్ని శాఖలతో పోలిస్తే అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలు అమోఘమని ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ మల్లారెడ్డి అన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఫైర్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనిఫాం సర్వీస్ అంటేనే నిరంతరం అప్రమత్తంగా ఉండటమేనని గుర్తు చేశారు. కొంతసమయం అలస్యమైనా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మురళి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా మొత్తం 490 అగ్ని ప్రమాదాలు జరిగాయని చెప్పారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న 11 మందిని ప్రాణాలతో కాపాడమని, 24 మంది మరణించడం విచారకరమన్నారు. ఫైర్ సిబ్బంది ప్రదర్శన ఆకట్టుకుంది. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అగ్నిమాపక శాఖలో విశిష్ట సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మంథని రాజేందర్‌రెడ్డి, టౌన్ ఏసీపీ కిరణ్ కుమార్, డివిజనల్ ఫైర్ ఆఫీసర్ మురళి మనోహర్‌రెడ్డి, అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ భానుప్రతాప్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు పాల్గొన్నారు.

అదనపు భారం మోయలేం..

- ధాన్యం సేకరణ విధులు వద్దని పీఎస్, ఎంపీవోల విజ్ఞప్తి
- పంచాయతీ పనుల్లోనే బిజీబిజీ
- ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు: జిల్లా పంచాయతీ అధికారి

సుభాష్‌నగర్: ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణ విధులను అప్పగించాలనే ప్రతిపాదనపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న పనులతోనే సతమతమవుతుంటే.. కొనుగోలు కేంద్రాల నిర్వహణ అదనపు భారమవుతోందని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 27 మంది ఎంపీవోలు, 530 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వీఆర్వోలు కొనుగోలు కేంద్రాల బాధ్యత నిర్వర్తించేవారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి వారిని ఇతర శాఖల్లోకి బదలాయించారు. ఇప్పటికే కొనుగోళ్ల బాధ్యత ఐకేపీ, వ్యవసాయశాఖ, రెవెన్యూ అధికారులు చేపడుతున్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

జిల్లా వ్యాప్తంగా 530 మంది పంచాయతీ కార్యదర్శులు ఉండగా, అందులో 350 మందికిపైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారు తమను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. జేపీఎస్‌లకు రెండు, మూడు నెలలకొకసారి జీతాలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీల్లో ఉపాధి పనులు, పల్లె ప్రగతి, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, పన్నుల వసూళ్లు, పారిశుధ్య పనులు, క్రీడా ప్రాంగణాలు, ఇతర పనులతో సతమతమవుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ తీరిక లేకుండా అదనపు భారంతో పనిఒత్తిడికి గురవుతామని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.



వెనకడుగుకే అవకాశం!

ధాన్యం కొనుగోళ్ల విధులపై ప్రభుత్వం వెనకడుగు వేసే అవకాశముంది. ఇప్పటికే ఈవిషయమై పంచాయతీరాజ్ అధికారుల రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆ శాఖ సెక్రెటరీని కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. బాధ్యతలు అప్పగించవద్దని కోరినట్లు పలువురు ఎంపీవోలు పేర్కొంటున్నారు. అందుకే ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచనలో పడిందని సమాచారం. కేవలం నల్గొండ జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలకు కొనుగోళ్ల బాధ్యత ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ నిర్ణయం సరికాదు

పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలకు కొనుగోలు కేంద్రాల నిర్వహణ విధులు అప్పగించే నిర్ణయం సరికాదు. ఇప్పటికే పని ఒత్తిడితో సతమతమవుతుంటే.. అదనపు భారం మోపొద్దు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. మరోసారి పునరాలోచించాలి. – మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్


ఉత్తర్వులు వచ్చాక ఆదేశిస్తాం..

పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల విధులకు సంబంధించి అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. అధికారిక ఉత్తర్వులు వచ్చిన తర్వాతే క్షేత్రస్థాయిలో ఆదేశాలిస్తాం. – జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి

ఆర్టీసీకి ఉపశమనం

- తగ్గిన బల్క్ డీజిల్ ధరలు
- సొంత బంక్లుల్లోనే బస్సులకు డీజిల్
- ఉమ్మడి జిల్లాలో నిత్యం 43,500 లీటర్ల వినియోగం

ఖలీల్‌వాడి : పెద్ద మొత్తంలో డీజిల్ కొనుగోలు చేసే(బల్క్) సంస్థలపై గతేడాది మార్చిలో చమురు సంస్థలు ధరల భారం మోపాయి. బల్క్ సంస్థల్లో ఆర్టీసీ కూడా ఉండడంతో తమ వద్ద అదనపు భారాన్ని ఆ సంస్థ డీజిల్ సెస్ పేరుతో ప్రయాణికులపై మోపింది. ఆర్టీసీ డిపోల్లోని బంకుల్లోనే బస్సులకు డీజిల్ సరఫరా చేస్తుండగా బయటి బంకుల కంటే తమ వద్ద ధర అధికంగా ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని డిపోల బస్సులకు బయటి బంకుల్లోనే డీజిల్ కొట్టించేవారు. ఇటీవల చమురు సంస్థలు బల్క్ డీజిల్ ధరలు తగ్గించడంతో ఏప్రిల్ నుంచి ఆయా డిపోల్లోని బంకుల్లోనే ఆర్టీసీ, అద్దె బస్సులకు డీజిల్ నింపుతున్నారు.



తప్పిన అసౌకర్యం

ఆర్టీసీ బస్సులకు బయట బంకుల్లో డీజిల్ పోయించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. కొందరు డ్రైవర్లు ప్రయాణికులను బస్సుల్లో ఎక్కించుకున్న తర్వాత బంకుల వద్ద వరుసలో నిలబెట్టడంతో అనేక మంది అసహనం వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటనలు ఉన్నాయి. అనంతరం ప్రయాణికులను దింపిన తర్వాత డీజిల్ పోయించాలన్నా డ్రైవర్లకు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం డిపోల్లోనే డీజిల్ నింపడంతో అటు ప్రయాణికులు ఇటు ఆర్టీసీ సిబ్బంది సమస్యలు తొలిగిపోయినట్లేనని అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లీటరు రూ.94.44కే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరు డిపోల పరిధిలో ప్రతి రోజు 43,500 లీటర్ల డీజిల్ వినియోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో లీటర్ డీజిల్ ధర రూ.99.45 ఉంది. బల్క్ ధరలు తగ్గడంతో ఆర్టీసీకి రూ.94.44కే డీజిల్ సరఫరా చేస్తున్నారు. దీంతో లీటర్‌కు రూ.5.1కు పైగా ఆదా అవుతోంది. బయట డీజిల్‌పై రోజుకు రూ.43.26 లక్షలకు పైగా అవుతుండగా ఆర్టీసీ బంకుల్లో రూ.41.08 లక్షలపైగా మాత్రమే అవుతుంది. దీంతో రోజుకు రూ.2.17 లక్షల చొప్పున నెలకు రూ. 65.38 లక్షలకు పైగా ఆర్టీసీకి డీజిల్‌పై ఆదా అవుతుంది.

కొంత భారం తగ్గింది

ఏడాది పాటు బయట బంకుల్లో బస్సులకు డీజిల్ పోయించాం. ప్రస్తుతం ధర తగ్గడంతో డిపోల్లోనే డీజిల్ నింపుతున్నాం. తగ్గిన ధరతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.రెండు లక్షలకు పైగా ఆదా అవుతుంది. – ఉషాదేవి, ఆర్ఎం, నిజామాబాద్

ఇసుక డంప్‌తో కూలిన షెడ్డు

నిజామాబాద్ నాగారం : నగరంలోని పాత ప్రభాత్ థియేటర్ వెనుక ప్రాంతంలో కొత్తగా నిర్మిస్తున్న అపార్టుమెంట్ కోసం గురువారం మధ్యాహ్నం ఇసుక డంప్ చేస్తుండగా చుట్టు పక్కల ఇళ్ల గోడలకు పగుళ్లు వచ్చాయి. పక్కనే ఉన్న పసుపు గిర్నీ షెడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. షెడ్డు యజమాని నాగుల జితేందర్ కుమార్‌తో పాటు ఆవుకు గాయాలయ్యాయి. షెడ్డు కూలడంతో అపార్టుమెంట్‌లో పని చేస్తున్న కూలీలందరు బయటకు పరుగులు తీశారు. షెడ్డులోని రూ.3 లక్షల విలువ చేసే పసుపు, అందులోని రూ. 1లక్ష పై విలువ చేసే సామగ్రి, రూ. 2 లక్షల విలువ చేసే షెడ్డును నష్టపోయినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో మూడో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాను ఏళ్లుగా షెడ్డులో పసుపు గిర్నీ నడుపుతున్నానని బాధిత యజమాని తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా నిర్మించే అపార్టుమెంట్‌కు రోడ్డు లేదన్నారు. దీనిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



పగుళ్లు ఏర్పడ్డ ఇంటి గోడ



ఇసుక డంప్‌తో కూలిన షెడ్డు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌ అర్బన్‌: హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్లో ఒకటో తరగతి(ఇంగ్లీష్‌ మీడియం)లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీకి చెందిన ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలకు మొత్తం ఆరు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం నుంచి పొందాలన్నారు. ఈనెల 29లోపు పూర్తిచేసిన దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9398 9387 71ను సంప్రదించాలన్నారు

'మంచి మనిషి కావాలి' సీడీ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్‌: తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌కు చెందిన కవి, రచయిత కొడి రవీందర్‌ రాసిన, దర్శకత్వం వహించిన 'మంచి మనిషి కావాలి' సామాజిక గీతం సీడీని గురువారం కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత మనోహర్‌రావు, తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్‌ శిక్షక్‌, వీఆర్‌ఏల జిల్లా అధ్యక్షుడు రవీందర్‌, కవులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీపీఎడ్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం బీపీఎడ్‌ 1వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, బ్యాక్‌లాగ్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ తెలిపారు. ఈ పరీక్షలో 38మంది విద్యార్థులకు గానూ 34 మంది హాజరైనట్లు కంట్రోలర్‌ తెలిపారు.

బీఈడీ పరీక్షల తేదీల్లో మార్పు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 28, 29 తేదీలలో జరగాల్సిన బీఈడీ మొదటి సెమిస్టర్‌ పరీక్ష తేదీల్లో మార్పు చేసినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మే 4, 5వ తేదీల్లో నిర్వహిస్తారని ఆమె తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ బీఈడీ కళాశాలల మొదటి సెమిస్టర్‌ విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని,వివరాలకు www. telanganauniversity. ac. inను సంప్రదించాలని ఆమె సూచించారు.

శ్రీకాంత్‌కు ప్రత్యేక ప్రోత్సాహక అవార్డు



లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లాలో అత్యధిక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతో మందికి ప్రాణదానం చేసిన లింగంపేట యువయూత్‌ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్‌ను బుధవారం రాత్రి కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ జిల్లా ప్రత్యేక ప్రోత్సాహక అవార్డుతో సన్మానించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, రవిగౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రికెట్‌ శిక్షణ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో క్రికెట్‌ క్రీడాకారులకు జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నేడు శిక్షణ శిబిరం ప్రారంభం కానుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం జీజీ కళాశాల ఆవరణలో శిక్షణ శిబిరాన్ని అర్బన్‌ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, మేయర్‌ నీతూకిరణ్‌ శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

నిధులు లేక సర్పంచులు విలవిల

- వేతనాలు అందక ఇబ్బందుల్లో మల్టీపర్పస్‌ వర్కర్లు
- జీపీలకు మంజూరుకాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు



రెంజల్‌ గ్రామ పంచాయతీ కార్యాలయం

రెంజల్‌(బోధన్‌): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కొన్ని నెలలుగా నిధులు రాకపోవడంతో జిల్లాలోని గ్రామ పంచాయతీల సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి సాధించి ఆదర్శ గ్రామాలుగా నిలుస్తున్నా.. జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 11 నెలలుగా ప్రభుత్వాల నుంచి నిధులు రాక అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీల నిర్వహణ తలకుమించిన భారంగా మారుతుందని సతమతమవుతున్నారు. అలాగే సంవత్సర కాలంగా విద్యుత్‌ బిల్లులు చెల్లించలేకపోతున్నామని పేర్కొంటున్నారు.

అప్పులు చేసి పనులు..

జిల్లాలోని 530 మంది సర్పంచ్‌లు గత సంవత్సరం మార్చి నెలలో ఖాతాలు తీశారు. ఒక నెల నేరుగా వారి ఖాతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు జమ చేసిన కేంద్రం తర్వాత తర్వాత నిధులను విడుదల చేయడం లేదని, దీనికి తోడు స్టేట్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ద్వార వచ్చే నిధులు 6 నెలలుగా నిలిచిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో చేపట్టే పారిశుద్ధ్య నిర్వహణ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అప్పులు చేసి అభివృద్ధి చేయాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదల నిలిపివేయగా ఖాతాల్లో ఉన్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్‌ చేయడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు.

సిబిల్‌ స్కోర్‌పై ప్రభావం..

పల్లెల అభివృద్ధి కోసం అప్పు చేసేందుకు సర్పంచ్‌లు వ్యక్తిగత పాన్‌, ఆధార్‌కార్డులను బ్యాంకులకు అందించారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు నిలిచిపోవడంతో బ్యాంకుల్లో కిస్తులు చెల్లించడంలేదు. దీంతో బ్యాంకుల్లో వ్యక్తిగతంగా డిఫాల్టర్‌ మారి సిబిల్‌ రిపోర్టుపై ప్రభావం పడటంతో వ్యక్తిగత రుణాలకు దూరమవుతున్నట్లు సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ఒక్కో సర్పంచ్‌కు సుమారు రూ.లక్షల్లో బిల్లులు రావాల్సి ఉండగా.. అప్పులు చేసిన పలువురు సర్పంచ్‌లు వాటిని చెల్లించేందుకు ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు సర్దుబాటు చేసుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నా.. ఉన్న నిధులు ఫ్రీజింగ్‌లో ఉండటంతో వాడుకోలేకపోతున్నారు. జీపీలకు నిధులు నిలిచిపోవడంతో జిల్లాలోని సర్పంచ్‌లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇటీవల పలు మండలాల సర్పంచ్‌లు ఎంపీడీవోలకు వినతిపత్రాలను అందించారు. అలాగే ఇటీవల కలెక్టర్‌కు కలిసి సమస్యలను విన్నవించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీపీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

జీతాలు ఇవ్వలేకపోతున్నాం..

జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెలా జీతాలు చెల్లించలేకపోతున్నాం. ట్రాక్టర్‌ ఈఎంఐలు, కరెంట్‌ బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందిగా మారింది. ఈ నెలాఖరు వరకు ప్రభుత్వాలు నిధులను విడుదల చేయాలి. 3నెలలుగా సిబ్బందికి జీతాలు ఇవ్వడంలేదు.

–వెల్మల సునిత, సర్పంచ్‌, తాడ్‌బిలోలి

వ్యక్తిగత రుణాలకు దూరమవుతున్నాం..

ట్రాక్టర్‌, ట్యాంకర్లు కొనుగోలుకు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. బ్యాంకు పంచాయతీలకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించడంలేదు. ఫలితంగా మా ఖాతాలు డిఫాల్టర్‌గా మారాల్సి వస్తుంది. సిబిల్‌ తగ్గడంతో వ్యక్తిగతంగా భవిష్యత్తులో నష్టం కలుగుతుంది.

–మర్ల రమేశ్‌కుమార్‌, సర్పంచ్‌, రెంజల్‌

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన సర్పంచులు

సుభాష్‌నగర్‌: జిల్లాలోని సర్పంచుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏటీఎస్‌ శ్రీనివాస్‌ కోరారు. ఈమేరకు సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో సర్పంచులు నిరసన తెలియజేశారు. శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. నిధులు ఫ్రీజింగ్‌ సమస్య అధికంగా వేధిస్తోందని, ఆరు నెలలైనా చెక్కులు పాస్‌ కావడం లేదని వివరించారు. సర్పంచులపై అధికారుల పెత్తనం ఉండొద్దని, ఉపసర్పంచులకు చెక్‌ పవర్‌ రద్దు చేయాలన్నారు. సర్పంచుల సొంత పూచీకత్తు పెట్టి ట్రాక్టర్‌ తీసుకున్నామని, ఈఎంఐలు సమయానికి కట్టక సిబిల్‌ స్కోర్‌ పడిపోయి రుణాలు రావడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే మే1 నుంచి ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి ఎడ్ల రాజేశ్వర్‌ రెడ్డి, ప్రతినిధులు గంగాప్రసాద్‌, రాజారెడ్డి, పోశెట్టి, ఏకార్‌ పాష, సత్తిబాబు, బూస సునీత, లింబారెడ్డి, సుమలత, లావణ్య, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్‌: ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు వైద్యసేవలు అందించే వెల్‌నెస్‌ సెంటర్‌కు అన్ని వసతులతో కూడిన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎంప్లాయీస్‌ జేఏసీ చైర్మన్‌ అలుక కిషన్‌ కోరారు. ఈమేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు గురువారం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును తన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని ఆయన హామీనిచ్చారు. శుక్రవారం జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటానని కలెక్టర్‌ తెలిపారు. అనంతరం కలెక్టర్‌ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్‌ చిత్రామిశ్రా నేతృత్వంలో నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి, మెప్మా షెల్టర్‌ హోమ్‌, మెప్మా బిల్డింగ్‌, ఇతర కమ్యూనిటీహాల్స్‌ను పరిశీలించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, టీఎన్‌జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి నేతికుంట శేఖర్‌, రిటైర్డ్‌ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడాల రవీందర్‌, ఆల్‌ పెన్షనర్స్‌ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ప్రెస్‌క్లబ్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేఖర్‌, రాజలింగం, సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మొరం అక్రమ తవ్వకాలు



జంలంలో మొరం తవ్వుతున్న జేసీబీ

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జంలం గ్రామ శివారులో అక్రమంగా మొరం తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈవిషయమై గురువారం రెవెన్యూ అధికారులను విలేకర్లు ప్రశ్నించగా.. మొరం తవ్వకాలకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఆర్‌ఐ ప్రభు వెంటనే వీఆర్‌ఏలను మొరం తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి పంపించారు. మొరం తవ్వకాలు జరుగుతున్న మాట వాస్తవమేనని వీఆర్‌ఏ ఆర్‌ఐకి తెలిపారు. అనంతరం ఆర్‌ఐ సర్వేయర్లను మొరం తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి పంపించారు. మొరం తవ్వకాలు జరపాలంటే రెవెన్యూ లేదా మైన్స్‌ అధికారుల అనుమతి తప్పనిసరి. ఈ అనుమతులు లేకుండానే మొరం తవ్వకాలు జరుపుతున్నారని తెలిసి కూడా వారిపై అధికారులు చర్యలు తీసుకోకుండా సర్వేల పేరుతో కాలయాపన చేయడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. సర్వే చేసి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ శేఖర్‌ను వివరణ కోరగా.. అక్రమంగా మొరం తవ్వకాలు జరిపినట్టు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ సిబ్బంది విచారణ జరుపుతున్నారని, వారి నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సౌదీ నుంచి క్షేమంగా సొంతూరికి..



కోటపాటి నర్సింహ నాయుడుని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న అజయ్‌ కుమార్‌

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన గుండేటి అజయ్‌ కుమార్‌ బుధవారం సౌదీ నుంచి క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. కొన్ని నెలల క్రితం ఉపాధి కోసం అజయ్‌ సౌదీ వెళ్లగా.. అక్కడి కంపెనీ వారు ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో ఇంటికి వెళ్తానంటే జరిమాన చెల్లించి వెళ్లాలని కంపెనీ వారు ఇబ్బందులకు గురి చేశారు. దీంతో అజయ్‌ కుటుంబ సభ్యులు ఇటీవల ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడును సంప్రదించారు. దీంతో కోటపాటి సౌదీలోని కంపెనీ అధికారులు, ఏజెంట్‌తో మాట్లాడి, జరిమాన లేకుండా అజయ్‌ను ఇంటికి చేరేలా కృషి చేశారు. ఇంటికి చేరుకున్న అజయ్‌ గురువారం కోటపాటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్‌

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): పట్టణంలోని కల్యాణి బేస్‌ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌పై అదే కాలనీకి చెందిన హబీబ్‌ ఖాదర్‌ దాడి చేసి, గాయపర్చడంతో గురువారం అరెస్టు చేసి రిమాండ్‌ చేసినట్లు ఎస్సై గణేష్‌ తెలిపారు. వివరాలు ఇలా.. ఈనెల 18న రాత్రి అకారణంగా చంద్రశేఖర్‌పై హబీబ్‌ ఖాదర్‌ కర్రతో దాడి చేయగా, అతడి చేయి విరగడంతో పాటు ముక్కుకు ఫ్రాక్చర్‌ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఖాదర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

మాక్లూర్‌: మండలంలోని గుత్ప శివారులో 63వ నంబర్‌ జాతీయ రహదారిపై గురువారం రాత్రి నిజాబాద్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వెళుతున్న స్కూటీ అదుపుతప్పడంతో ఇద్దరికి గాయాలైనట్లు తెలిసింది. స్థానికులు వారిని గమనించి వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం. ఈ విషయమై ఎస్సై యాదగిరిగౌడ్‌ను వివరణ కోరగా తమ వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



సదాశివనగర్‌ (ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన గాదారి గౌరవ్వ(106) శతాధిక వృద్ధురాలు గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతిరాలికి కుమారులు పెంటరెడ్డి, బాలరెడ్డి, కుమార్తెలు బాలమణి, వజ్రవ్వలు ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన పలు ఘటనల్లో ఆరుగురు ప్రమాదవశాత్తు మృతిచెందారు. మామిడి చెట్ల పైనుంచి జారిపడి ఇద్దరు మృతిచెందగా.. ఇంటి పైనుంచి జారిపడి ఒకరు మృత్యువాత పడ్డారు. అలాగే ఓ వృద్ధుడు చెరువులో పడి మృతిచెందగా.. రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు.



బాల్‌రాజు (ఫైల్‌)

మాచారెడ్డి: మామిడి కాయలు తెంపే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన గురువారం లచ్చాపేటలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌ కుమార్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బూస బాల్‌రాజు(43) తన చేను వద్ద ఉన్న మామిడి చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో ఆయన వెన్నెముక విరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

లింగంపేట మండలంలో..



బాల్యా (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కన్నాపూర్‌ తండాకు చెందిన కేతావత్‌ బాల్యా(50)బుధవారం సాయంత్రం మామిడి చెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. తండా సమీపంలోని పంట చేనులో ఉన్న మామిడి చెట్టుపైకి ఎక్కిన బాల్యా, కాయలు తెంపుతుండగా.. అతడు నిలబడిన కొమ్మ విరిగిపోవడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. భార్య లక్ష్మి గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెకండ్‌ ఫ్లోర్‌ పైనుంచి పడి హెచ్‌ఎం..



ఎల్లయ్య (ఫైల్‌)

పిట్లం(జుక్కల్‌): ఇంటి సెకండ్‌ ఫ్లోర్‌ పైనుంచి పడి హెచ్‌ఎం మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌ కొండ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని సిద్దాపూర్‌ గ్రామానికి చెందిన ఎల్లయ్య (54) పిట్లంలోని ఓ ఇంట్లో సెకండ్‌ ఫ్లోర్‌లో అద్దెకు ఉంటున్నాడు. పెద్దకొడప్‌గల్‌ మండలంలోని కాటేపల్లి గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో మిగిలిన అన్నంను పైనుంచి కిందికి పడేయడానికి వెళ్లి, ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడ్డాడు. దీంతో ఎల్లయ్య తీవ్రంగా గాయపడగా, అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇంటి యజమాని బిల్డింగ్‌ రిపేరు నిమిత్తం ప్రహరీకి ఉన్న సేఫ్టీ రాడ్స్‌ను తీసివేయడంతో ప్రమాదం జరిగిందని, పోలీసులు మృతదేహాన్ని ఘటన స్థలం నుంచి వెంటనే ఆస్పత్రికి తరలించారని ఎల్లయ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

చెరువులో పడి వృద్ధుడు..



పోతయ్య (ఫైల్‌)

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలకేంద్రంలోని ఎల్చల పోతయ్య (72) ప్రమాదవశాత్తు గ్రామ చెరువులో మునిగి మృతిచెందినట్లు ఎస్సై మహేష్‌ గురువారం తెలిపారు. పోతయ్య గేదెలను మేపడానికి వెళ్లగా.. చెరువులో వాటిని దింపే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటమునిగి చనిపోయాడు. మృతుడి కొడుకు మోహన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



సంజీవులు (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి)/ఇందల్వాయి: లింగంపేట మండలంలోని అయిలాపూర్‌ గ్రామానికి చెందిన సూర్ణ సంజీవులు(25) గురువారం నిజామాబాద్‌ జిల్లాలోని ఇందల్వాయి 44 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు, ఎస్సై నరేష్‌ తెలిపారు. వివరాలు ఇలా.. సంజీవులు తన వదిన కూతురును తీసుకురావడానికి బైక్‌పై సొంతూరు నుంచి నిజామాబాద్‌కు బయలుదేరాడు. ఇందల్‌వాయి వద్ద ఎక్సెల్‌ బండిని తోసుకుంటూ వెళ్తున్న వ్యక్తిని సంజీవులు ఢీకొనడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌కు తాకి కిందపడిపోయాడు. ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా.. స్థానికులు టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనదారుడికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. మృతుడు దాబాల్లో మాస్టర్‌గా పని చేసేవాడు. అలాగే డ్రైవింగ్‌ సైతం చేసేవాడు. అతడికి భార్య, రెండు నెలల కొడుకు ఉన్నాడన్నారు. మృతుడి తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను కారు ఢీకొన్న ఘటనలో..



సదాశివ నగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని బాలరాంపూర్‌ జిల్లా బాబన్‌ గ్రామానికి చెందిన ఎండీ ఆరిఫ్‌(16) పీవోపీ పని చేస్తున్నాడు. కామారెడ్డి నుంచి పద్మాజివాడి వైపు అతడు వర్కర్లతో కలిసి ఆటోలో వెళ్తుండగా వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టడంతో ఆరీఫ్‌ మృతిచెందాగా.. నలుగురు గాయపడ్డారు. మృతుడి మేనమామ కరీముల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేష్‌ తెలిపారు.

జింకపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడ్డ జింక

వర్ని: మండల పరిధిలోని సత్యానారాయణపురం శివారులో గురువారం జింకపై కుక్కల మంద దాడి చేసింది. గంగారెడ్డినగర్‌ అటవీ ప్రాంతం నుంచి ఓ జింక బోధన్‌ రోడ్డు దాటుతుండగా కుక్కల మంద దాడి చేసింది. అటుగా వెళుతున్న యువకులు గమనించి కుక్కల నుంచి జింకను కాపాడి వర్ని పశువైద్యశాలకు తీసుకువచ్చి చికిత్స చేయించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు జింకను అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో మేకల మృతి



అంబం(ఆర్‌)లో అనుమానాస్పదంగా మృతి చెందిన మేకలు

రుద్రూర్‌: మండలంలోని అంబం (ఆర్‌) గ్రామంలో గురువారం అనుమానాస్పద స్థితిలో పది మేకలు మృతి చెందాయి. మేకల యాజమాని బట్టు గంగారాం షెడ్డు వద్దకు గురువారం ఉదయం వచ్చే సరికి మేకలు మృతి చెంది ఉన్నాయి. కుక్కల దాడిలో మృతిచెందాయా? ఎవరైనా చంపి వెళ్లారా ?అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వివిధ కారణాలతో పలువురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిలో ఇద్దరు కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు యత్నించగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు అలాగే ఒకరు కుటుంబ కలహాల కారణంగా, మరొకరు మద్యానికి బానిసై బలవన్మరణానికి పాల్పడ్డారు.



పట్నే గంగాధర్‌(ఫైల్‌)

మద్నూర్‌(జుక్కల్‌): డోంగ్లీ మండలంలోని మారెపల్లి గ్రామానికి చెందిన పట్నే గంగాధర్‌(24) కడుపునొప్పి తగ్గకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. గంగాధర్‌కు చాలా కాలంగా కిడ్నీలో రాళ్లు ఉండి తీవ్రమైన కడుపు నొప్పి ఉందన్నారు. ఎన్ని మందులు వాడిన నొప్పి తగ్గకపోవడంతో విరక్తి చెంది, ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి కుటుంబీకులను సమాచారం అందించారు. చికిత్స పొందుతూ.. నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దోమకొండ మండలంలో..

దోమకొండ: మండలంలోని అంచనూరు గ్రామానికి చెందిన ఎంగని అరుణ(23) అనే యువతి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. అరుణ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండగా, విరక్తి చెంది ఈనెల 19న పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబసభ్యులు కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేట అశ్విని ఆస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

లింగంపేట మండలంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై శంకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కొండ శ్రీనివాస్‌ (38) లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న తన భార్యతో గొడవ జరిగింది. 19న ఉదయం మళ్లీ భార్యభర్తలు గొడవ పడ్డారు. దీంతో శ్రీనివాస్‌ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం అహ్మద్‌ అనే వ్యక్తి తునికాకు సేకరణకు అటవీ ప్రాంతానికి వెళ్లగా శ్రీనివాస్‌ చెట్టుకు తెల్ల టవల్‌లో ఉరేసుకొని కనిపించినట్లు తెలిపాడు. శ్రీనివాస్‌ మృతిపై అనుమానాలు ఉన్నట్లు తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..



ఆకాష్‌ (ఫైల్‌)

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావుపేట గ్రామానికి చెందిన అవుసుల ఆకాష్‌(19) మద్యానికి బానిసై, ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజేష్‌ తెలిపారు. వివరాలు ఇలా.. ఆకాష్‌ ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగించేవాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై ఊరిలో అందరితో గొడవలు పడుతుండేవాడు. డబ్బుల గురించి ఇంట్లో వస్తువులను పగలగొట్టేవాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లోని సామాను పగలగొట్టి, క్షణికావేశంలో చీరతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. అతని తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.